కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో... టమాట 25, పచ్చిమిర్చి 55-60, బెండ 60, కాకర 60, దొండ 60, దోస 50, ఆలు 25, చామ 60, కీర 25, బీర 70, వంకాయ 50, గోకర 60, బీన్స్ 50, బీట్‌రూట్ 50, క్యాప్సికమ్ 80, క్యాబేజీ 25, క్యారెట్ 60, చిక్కుడు 50, ఉల్లి 40 (1 కేజీ), ములక్కాయలు (1) 10 , క్యాలీఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) 20, అల్లం 260, వెల్లుల్లి 260.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హఫీజ్‌పేట్ : పాపిరెడ్డి సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా మంగళవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.

- మార్కెట్ ఫీడర్ పరిధిలో ప్రేమ్‌నగర్ వెనకాల, రోలింగ్ మిడోస్, సీఎం తోట వైపు, 100 ఫీట్ రోడ్డు ఇరువైపుల ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.
- ప్రేమ్‌నగర్ ఫీడర్ పరిధిలో ప్రేమ్‌నగర్ వెనకాల, 100 ఫీట్ రోడ్డు ఇరువైపుల, హఫీజ్‌పేట్, మార్తాండనగర్, ప్రేమ్‌నగర్ బి బ్లాక్, హనీఫ్ కాలనీ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ రాజేందర్ తెలిపారు.

హఫీజ్‌పేట్ : వేముకుంట సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- కెఎస్‌ఆర్ ఫీడర్ పరిధిలో కెఎస్‌ఆర్ రోడ్డు, రోడ్డు నెంబర్లు 2,4,6,8,9,12,20 తదితర విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.
- భిక్షపతి ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో శ్రీదేవి థియేటర్, భిక్షపతి ఎన్‌క్లేవ్, జవహర్ నగర్ కాలనీ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఒకరికి కోవిడ్ పాజిటివ్

గచ్చిబౌలి: కోవిడ్ టెస్టులలో ఒకరికి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యిందని కొండాపూర్ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనురాగిని రెడ్డి తెలిపారు. సోమవారం 26 మందికి రాపిడ్ యాంటిజెన్ టెస్టులు చేయగా ఒకరికి పాజిటివ్‌గా తేలిందన్నారు. దగ్గు, జలుబు, జ్వరం, ఒంటి నొప్పులు తగ్గకుండా ఉన్న వారు కోవిడ్ టెస్టులు చేయించుకోవాలని ఆమె సూచించారు.

గోపీనగర్, నెహ్రూనగర్‌లలో కార్పొరేటర్ పర్యటన



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ గోపీనగర్, నెహ్రూనగర్‌లో కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ సోమవారం పర్యటించారు. నూతనంగా చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను పరిశీలించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ డ్రైనేజీ పైప్‌లైన్ పనులతో ఎన్నో ఏళ్ళుగా ఉన్న సమస్యకు పరిష్కారం లభించడం ఎంతో సంతోషం అన్నారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ అభిషేక్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రాజుయాదవ్ పాల్గొన్నారు.

ప్రజావాణిలో 12 వినతి పత్రాల స్వీకరణ



హఫీజ్‌పేట్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో ప్రారంభించామని ఉపకమిషనర్ వంశీ కృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 వినతి పత్రాలు అందగా దానిలో 8 అభయహస్తం దరఖాస్తులు, 4 ఇతర సమస్యలపై వినతులు అందాయన్నారు. ఈ వినితి పత్రాలు సంబంధిత అధికారులకు పరిష్కరించాలని ఆదేశించడం జరిగిందన్నారు. ప్రజలు ఎల్లప్పుడు తమ సమస్యలను ప్రజావాణిలో వినిపించవచ్చని పేర్కొన్నారు.

పీఆర్‌టీయూ కేలండర్ ఆవిష్కరణ



గచ్చిబౌలి: పీఆర్‌టీయు శేరిలింగంపల్లి శాఖ కేలండర్‌ను హోప్ ఫౌండేషన్ చైర్మెన్ కొండా విజయ్‌కుమార్ ఆవిష్కరించారు. సోమవారం గచ్చిబౌలి జడ్పీహెచ్‌ఎస్‌లో పీఆర్‌టీయు శా అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. పీఆర్‌టీయు రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గోవర్ధన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి మహేందర్ రెడ్డి, కృష్ణా రెడ్డి, శేరిలింగంపల్లి మండల విద్యాధికారి వెంకటయ్య పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

హఫీజ్‌పేట్: ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో ఎస్‌బీఆర్ యూత్ ఇండియన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజలు, కార్మికులు ముందస్తు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ఎంతో ఉపయోగకరమన్నారు. కాంగ్రెస్ నాయకులు మహిపాల్ యాదవ్, సాంబశివరావు, కావూరి ప్రసాద్ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

హఫీజ్‌పేట్ : మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మియాపూర్ చౌరస్తాలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై సీఐ పవన్ కుమార్ సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లందరు తమ వాహనంలో ఆటోలకు సంబంధించిన పత్రాలు ఆర్సీ, డ్రైవింగ్ లైసెన్స్, యూనిఫారం వాహనంలో ఉండాల్సినవన్ని ఉంచుకోవాలన్నారు. పత్రాలు లేకుండా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్ఐలు నవీన్ కుమార్, హెడ్ కానిస్టేబుల్ ఉపేంద్ర, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, ఆటో యూనియన్ నాయకులు బాబు గౌడ్, హనీఫ్, తిమ్మరాజు, కేశవులు తదితరులు పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాల కూల్చివేత

● ఒత్తిళ్లకు తలొగ్గి కొన్ని ఇళ్లనే కూల్చిన అధికారులు ● ఇదేం పద్ధతంటూ ప్రశ్నిస్తున్న స్థానికులు





శంషీగూడలో అక్రమంగా నిర్మిస్తున్న ఇళ్లను కూల్చివేస్తున్న జీహెచ్ఎంసీ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

ఆల్విన్‌కాలనీ: జీహెచ్ఎంసీ అనుమతులు పొందకుండా విరుద్ధంగా నిర్మించిన అక్రమ నిర్మాణాలను అధికారులు నేలమట్టం చేశారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శంషీగూడ గ్రామంలో అక్రమంగా నిర్మించిన ఇంటి నిర్మాణాలను సోమవారం కూకట్‌పల్లి జీహెచ్ఎంసీ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కూల్చివేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు తీసుకోకుండా ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే వాటిని కూల్చివేస్తామన్నారు.అదే విధంగా వారిపై ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

◆ ఆదివారం ఒక్క ఇంటిని మాత్రమే కూల్చివేసిన అధికారులు సోమవారం తిరిగి రెండు ఇళ్లను మాత్రమే కూల్చివేశారు. ఇంకా అక్రమ నిర్మాణాలు ఆ ప్రాంతంలో ఉన్నప్పటికీ వాటిని కూల్చికపోవడానికి గల కారణాలు ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అనుమతలకు విరుద్ధంగా నిర్మించిన వాటిని కూల్చివేస్తామని నోటీసులు ఇచ్చి రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎందుకు కూల్చలేదని ప్రశ్నిస్తున్నారు. పేదలు ఇళ్ల నిర్మించుకుంటే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా హడావుడిగా కూల్చివేసే అధికారులు ఎందుకు తాత్సార్యం చేస్తున్నారని అడుగుతున్నారు.

◆ మాముళ్లకు కక్కుర్తి పడి పెద్దల ఒత్తిళ్లకు తలొగ్గి కూల్చివేతలు చేయకుండా తప్పించుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కూకట్‌పల్లి జీహెచ్ఎంసీ అధికారులు పేదోడికి ఓ న్యాయం.. పెద్దోడికి ఓ న్యాయం అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అక్రమ నిర్మాణాలకు కేరాఫ్‌గా కూకట్‌పల్లి సర్కిల్ మారిందని తెలుపుతున్నారు. మొదట్లోనే అక్రమ నిర్మాణాలు నిర్మించకుండా అడ్డుకుంటే ప్రజల సొమ్ము దుర్వినియోగం కాకుండా ఉంటుందని పేర్కొంటున్నారు.

బాధ్యతలు చేపట్టిన మాదాపూర్ నూతన డీసీపీ



గచ్చిబౌలి: సైబరాబాద్ కమిషనరేట్‌లోని మాదాపూర్ జోన్ నూతన డీసీపీగా డాక్టర్ వినీత్ బాధ్యతలు చేపట్టారు. గచ్చిబౌలిలోని డీసీపీ కార్యాలయంలో ఆయన సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మాదాపూర్‌జోన్ పరిధిలో పనిచేసే ఏడీసీపీ నంద్యాల నర్సింహ్మారెడ్డి, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారంతా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

నిప్పంటించుకొని మహిళ ఆత్మహత్య

హఫీజ్‌పేట్ : పెట్రోల్ పోసుకొని ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రఘు తెలిపిన మేరకు.. గోపీనగర్‌కు చెందిన షమీమ్ బేగం (58) ఆమె తల్లిదండ్రులతో నివాసముంటోంది. 5 సంవత్సరాల నుంచి మానసికంగా బాగా లేదు. మద్యానికి బానిస అయింది. ఈ నెల 7న రాత్రి 10.30 గంటలకు ఇంట్లో అందరూ నిద్రపోయే సమయంలో మద్యం మత్తులో ఒంటిపై పెట్రోల్ పొసుకొని నిప్పంటించుకుంది. అప్పటికే షమీమ్ బేగం పూర్తిగా కాలిపోయి కిందపడిపోయింది. వెంటనే ఆమెను చికిత్స కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 10 గంటలకు మృతి చెందింది. ఈ మేరకు చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సీఎంకు కాంగ్రెస్ నేత శుభాకాంక్షలు



శేరిలింగంపల్లి: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి.జగదీశ్వర్‌గౌడ్‌కు సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు పూర్తి అయిన సందర్భంగా సీఎంను కలిశారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు ఇళ్ళను కేటాయింపుకు చర్యలు తీసుకోవాలని జగదీశ్వర్‌గౌడ్ కోరారు.

గడపగడపకు అయోధ్య అక్షింతల కార్యక్రమం



రాయదుర్గం: అయోధ్యలోని శ్రీరాముని ఆలయానికి చెందిన అంక్షితలను 'గడప గడపకి అయోధ్య అక్షింతలు' కార్యక్రమాన్ని రాయదుర్గంలో నిర్వహించారు. శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్రం ఆధ్వర్యంలో ఆ కార్యక్రమాన్ని రాయదుర్గం ఇంటింటికి వెళ్ళి కార్యకర్తలు భక్తి శ్రద్ధలతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రతినిధులు నిఖిల్‌యాదవ్, అనీల్, కిషోర్, విశాల్, విక్షిత్ పాల్గొన్నారు.

మాతృశ్రీనగర్‌లో సంక్రాంతి సంబరాలు



హఫీజ్‌పేట్: మాదాపూర్ డివిజన్ పరిధిలోని మాతృశ్రీనగర్ కాలనీలో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సంబరాలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ హాజరై ముగ్గుల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో జరిగే సంక్రాంతి పర్వదిన వేడుకలు గ్రామీణ ప్రాంతాలను తలపించేలా మాతృశ్రీ నగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ వారు సంక్రాంతి సంబరాలను నిర్వహించుకోవడం చాలా సంతోషకరమన్నారు. మహిళలు వేసిన ముగ్గులను అంగరంగ వైభవంగా వేశారన్నారు.

మహిళలపై హింసను అరికట్టాలి



కార్యక్రమంలో పాల్గొన్న ఎఫ్ఐజీవో ట్రెజరర్ శాంతకుమారి తదితరులు

మాదాపూర్ : ఆపదలో ఉన్న మహిళకు మార్గనిర్దేశం చేసేందుకు సహాయం చేయడానికి ఎఫ్‌వోజీఎస్ఐ సభ్యులకు అవగాహన కల్పిస్తున్నామని ఎఫ్ఐజీవో ట్రెజరర్ శాంతకుమారి తెలిపారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహిస్తున్న గైనకాలజీ సదస్సులో సోమవారం (రెండవ రోజు) దీర మహిళలపై హింసను అరికట్టండి అనే అంశంపై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శాంతకుమారి మాట్లాడుతూ 9 నుంచి 11 సంవత్సరాల పిల్లలకు మహిళలపై జరుగుతున్న హింసపై చైతన్యం కలిగించడానికి రెండు గంటల ఆన్‌లైన్‌కోర్సు ప్రారంభించామన్నారు. ఇప్పటి వరకు దాదాపు 3700 పాఠశాలలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భారతదేశంలోని అన్ని పాఠశాలల పాఠ్యాంశాల్లో ఈకార్యక్రమాన్ని తప్పనిసరి చేయడమే లక్ష్యమన్నారు. ఈకార్యక్రమంలో అంతర్జాతీయ కార్పోరేట్ లాయర్ డాక్టర్ ధరణి సుయోధన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ



రాయదుర్గం: టీఎన్జీఓస్‌కాలనీ రంగారెడ్డి జిల్లా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గడ్డం జంగయ్య మనమరాలు చిన్నారి శ్రేష్ఠ పుట్టిన రోజు సందర్భంగా నానక్‌రాంగూడలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో మొదటి తరగతి చదువుతున్న 52 మంది విద్యార్థులకు స్కూలు బ్యాగులను సోమవారం పంపిణీ చేశారు. అనంతరం పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు.

నేడు వివేకానంద సేవా సమితి స్వర్ణోత్సవాలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని వివేకానంద సేవా సమితి స్వర్ణోత్సవాలను ఈనెల 9వ తేదీన కూకట్‌పల్లి పీఎస్ఎం హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎ.జలవేందర్‌రావు, అధ్యక్షుడు సీహెచ్. హనుమంతరావు, కార్యదర్శి సీహెచ్ రాజేశ్వరరావు, ఉపాధ్యక్షులు జి. సుజనప్రభ ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5గంటలకు జరిగే ఈ వేడుకకు ముఖ్యఅతిథిగా మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, విశిష్ట అతిథి, ప్రధాన వక్త, మహాసహస్రావధాని, పద్మశ్రీ డా.గరికపాటి నరసింహారావు, ఆత్మీయ అతిథి బీవీపీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అశ్వినీ సుబ్బారావు, సభాధ్యక్షులుగా వివేకానంద సేవా సమితి చైర్మన్ సీహెచ్ హనుమంతరావు పాల్గొనున్నారు. సభానంతరం పీఎస్ఎం హైస్కూల్ విద్యార్థులతో సాంస్కృతిక విభావరి ఉంటుందని తెలిపారు.

దుర్గం చెరువులో నీటి శాంపిల్స్ సేకరణ

మాదాపూర్: దుర్గం చెరువు కలుషితం కావడంతో వందలాది చేపలు మృత్యువాత పడుతున్నాయి. దుర్గం చెరువు పరిరక్షణకు హైకోర్టు ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. దీనిలో భాగంగా హైకోర్టులీగల్ సర్వీసెస్ కమిషన్ చైర్మన్ శాంతివర్ధిని మాదాపూర్‌లోని దుర్గంచెరువు నీటి స్వచ్ఛతను పరిక్షించేందుకు సోమవారం 9 మంది బృందంతో నీటి సాంపిల్స్‌ను సేకరించారు. వివిధ రకాల పరికాలతో దుర్గంచెరువు ప్రాంతంలోని వివిధ ప్రదేశాలలో సాంపిల్స్‌ను సేకరించారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్టు తెలిపారు. దుర్గం చెరువులోకి డ్రైనేజీ వాటర్ ఎలా వస్తుంది. ఎటునుంచి పోతుంది, నీటి స్వచ్ఛతను ల్యాబ్‌లో పరీక్షించి పూర్తివివరాలను అందజేయనున్నట్టు తెలిపారు.

జగదీశ్వర్‌గౌడ్‌ను కలిసిన మహిళా కమిటీ సభ్యులు



ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ మహిళా కమిటీ నాయకులు సోమవారం శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు మారెళ్ల శ్రీనివాసరావు, మహిళా కమిటీ దుర్గారాణి, సత్తూరి శిరీష, శ్రీదేవి, సుజాత, కృష్ణకుమారి, కొండమ్మ, మౌనిక, వసంత, శ్రీలక్ష్మి, విజయ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు అండగా ఉంటాం

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. భారతినగర్ డివిజన్ పరిధిలోని సోమవారం వార్డు కార్యాలయంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సర్వీసు కాలంలో ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రజలకు మెరుగైన సేవలు అందించారని గుర్తు చేశారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి అండగా ఉంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సింధురెడ్డి, పుష్ప, మాజీ కార్పొరేటర్ అంజయ్య, సర్కిల్ అధ్యక్షుడు పరమేష్‌యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సత్యనారాయణ, ఐలేష్ యాదవ్, ప్రమోద్‌గౌడ్, నాయకులు దేవేందర్‌చారి పాల్గొన్నారు.

పటాన్‌చెరు: రూ.1200 కోట్ల అంచనా వ్యయంతో మదీనాగూడ నుంచి లింగంపల్లి పటాన్‌చెరు మీదుగా సంగారెడ్డి వరకు త్వరలో చేపట్టనున్న జాతీయ రహదారి విస్తరణ పనులను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన వెంట జాతీయ రహదారుల సంస్థ ఈఈ ధర్మారెడ్డి, పటాన్‌చెరు కార్పొరేటర్ కుమార్‌యాదవ్, ముత్తంగి గ్రామ సర్పంచ్ ఉపేందర్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

అభయహస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ ఎంట్రీల ప్రారంభం



హఫీజ్‌పేట్ : అభయహస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ ఎంట్రీలను ప్రారంభించినట్లు చందానగర్ సర్కిల్ 21 ఉప కమిషనర్ వంశీకృష్ణ పేర్కొన్నారు. సోమవారం చందానగర్ అంబేద్కర్ కల్యాణ మండపంలో చేపట్టిన దరఖాస్తుల ఆన్‌లైన్ ఎంట్రీల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద, మధ్య తరగతి ప్రజల కోసం తీసుకువచ్చిన ప్రజాపాలన కార్యక్రమం తుది గడువు 6వ తేదీన ముగిసింది. దీంతో చందానగర్ సర్కిల్ పరిధిలో ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులు 55530 వచ్చాయన్నారు. అందులో 39080 అభయహస్తం కింద, 16400 ఇతర దరఖాస్తులు వచ్చాయన్నారు. అభయహస్తం కింద వచ్చిన దరఖాస్తులను కంప్యూటర్‌లోని ప్రజాపాలన ఆన్‌లైన్ సైట్‌లో పొందుపరుస్తున్నామన్నారు. అందుకు గాను 130 మంది సిబ్బందితో 17వ తేది వరకు ఆన్‌లైన్‌లో పొందుపస్తున్నామన్నారు. ఇందులో స్కిల్ డెవలప్‌మెంట్ కింద 50 మంది, జీహెచ్ఎంసీ నుంచి 32 సిబ్బంది ఇంకా మిగతా వారిని లైట్ హోమ్ స్కిల్ డెవలప్‌మెంట్ వారికి అప్పగించామన్నారు.

ప్రజావాణిలో నాలుగు దరఖాస్తులు



దరఖాస్తులను స్వీకరిస్తున్న డీసీ రజనీకాంత్‌రెడ్డి

శేరిలింగంపల్లి: ప్రజావాణి కార్యక్రమాన్ని శేరిలింగంపల్లి సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు నాలుగు దరఖాస్తులను ప్రజల నుంచి స్వీకరించారు. ప్రతి సోమవారం సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి, ఏఎంఓహెచ్ నగేష్‌నాయక్, ఏఎంసీ నరేందర్‌రెడ్డి, టీపీఎస్ రమేష్ పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలు



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ప్రతి కాలనీని అభివృద్ధే లక్ష్యంగా ప్రణాళికలను రూపొందిస్తూ నిధులను కేటాయిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి తెలిపారు. మున్సిపల్ పరిధిలోని ఐదో వార్డు ఆర్టీసీ కాలనీలో రూ.70లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, రూ.40లక్షలతో నిర్మించనున్న యూజీడీ నిర్మాణ పనులను కౌన్సిలర్ మహదేవరెడ్డితో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పాండురంగారెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటవుతున్న కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ నరసింహగౌడ్, కోఆప్షన్ సభ్యులు రాములు, వీఫర్‌యూ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్, కార్యకర్తలు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

పాఠశాల సమస్యలను

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం

కాంగ్రెస్ నేత ఏకాంత్ గౌడ్



వెంకటేశ్వరనగర్‌లోని జెడ్పీహెచ్ఎస్‌లోని సమస్యలను పరిశీలిస్తున్న ఏకాంత్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్ సూచన మేరకు వివేకానందనగర్ డివిజన్ వెంకటేశ్వరనగర్‌లోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలోని సమస్యలపై కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఏకాంత్‌గౌడ్ సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హ్యాట్రిక్ ఎమ్మెల్యే అని చెప్పుకునే బీఆర్ఎస్ నాయకులకు వెంకటేశ్వరనగర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాలలో సమస్యలు కనపడటం లేదా అని ప్రశ్నించారు. 750 మంది విద్యార్థులు ఉన్న ఈ పాఠశాలలో పదేళ్లుగా విద్యార్థులకు తగ్గ విధంగా బాత్‌రూమ్‌లు నిర్మించలేదన్నారు. విద్యార్థులకు అనుగుణంగా సోషల్, బయాలజీకి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉండటం. స్కావెంజర్లు లేకపోవటం వంటి అనేక సమస్యలపై ఇప్పటి వరకు దృష్టి పెట్టకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. స్కూల్‌లో సమస్యలను కాంగ్రెస్ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌గౌడ్, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కాస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పల్నాటి అశోక్, గణేష్‌గౌడ్, జితేందర్, మర్ల శ్రీను, వినోద్, బొట్టు శ్రీను, షాలిని, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని బొల్లారానికి చెందిన సుమిత్రాదేవి కొంతకాలంగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతోంది. ఈ విషయాన్ని తెలుసుకున్న మున్సిపల్ వైస్‌చైర్మన్ అనిల్ కుమార్‌రెడ్డి సుమిత్రాదేవికి రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. దీంతో అనిల్‌కుమార్‌రెడ్డికి సుమిత్రాదేవి కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలోని శిఖం, ప్రభుత్వ భూముల్లో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను తహసీల్దార్ రవికుమార్ ఆదేశాల మేరకు ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ జేసీబీలతో కూల్చివేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ, శిఖం భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రజావాణిలో ఫిర్యాదులను పరిష్కరించాలి

కూకట్‌పల్లి జెడ్‌సీ అభిలాష అభినవ్



ప్రజావాణి కార్యక్రమంలో అధికారులతో కలిసి పాల్గొన్న నూతన కమిషనర్ అభిలాష అభినవ్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌గా నూతనంగా నియమితులైన అభిలాష అభినవ్ అధికారులతో కలిసి పలువురి నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మూసాపేట 2, కూకట్‌పల్లి 1, కుత్బుల్లాపూర్ 1, గాజులరామారం 6, ఆల్వాల్ 1, జోన్‌కు సంబంధించి 9 మంది నుంచి సమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. సమస్యలను అధికారులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.